క్లుప్తంగా

లక్ష్మీవెంకటేశ్వరస్వామికి వెండికాసుల హారం



లక్ష్మీవెంకటేశ్వరస్వామికి వెండికాసుల హారాన్ని అందిస్తున్న దాతలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్ లక్ష్మీవెంకటేశ్వరస్వామికి దాతలు వెండికాసుల హారాన్ని వితరణగా అందించారు. ఆలయంలో శుక్రవారం దాత మేడ రవిచంద్ర ప్రసాద్, ఉష దంపతులు రూ.75 వేలు విలువ చేసే వెండి కాసుల హారాన్ని ఆలయ చైర్మన్ చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. దాతల పేరున ఆలయ అర్చకులు రాజేష్ ఆచార్యులు ప్రత్యేక పూజలు చేయించారు.

హోంగార్డు మృతి



నరసింహులు(ఫైల్)

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో పని చేసే హోంగార్డ్ నరసింహులు (53) అనారోగ్యంతో మృతి చెందారు. అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన ఈయన బ్యాండ్‌బ్యాస్ టీంలో పనిచేస్తున్నారు. అనంతపురంలోని రాంనగర్‌లో నివాసం ఉండేవారు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో అనంతపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గార్లదిన్నెలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్‌ఐ వలి, హోంగార్డుల ఇన్‌చార్జ్ రామాంజనేయులు తదితరులు నరసింహులు మృతునికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

అమడగూరు: అన్నదాత సుఖీభవ పథకం కోసం అర్హులైన రైతులందరూ ఈకేవైసీ(వేలి ముద్ర) చేయించుకోవాలని ఏఓ వెంకటరమణాచారి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్ని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన, పట్టు అధికారులు రైతుల నుంచి వేలిముద్రను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితాలో ఉన్న రైతులందరూ పథకానికి అర్హులన్నారు. రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించి వేలిముద్రలు వేయాలన్నారు.

తిక్కనారాయణస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న న్యాయవాది గుంటెప్ప

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తిక్కనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం సీనియర్ న్యాయవాది గుంటెప్ప పేదలు, అనాథలకు అన్నదానం చేశారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతినెలా తిక్కనారాయణస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్నామని న్యాయవాది తెలిపారు. అన్నదానం చేసిన న్యాయవాదిని ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు అభినందించారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రాఫిట్ షూ మార్ట్‌లో శుక్రవారం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులు మనోజ్‌కుమార్, గౌతమ్‌కృష్ణను ఎంఈఓ గోపాల్‌నాయక్, ఎస్‌ఐ గోపికుమార్, ప్రాఫిట్ షూమార్ట్ బ్రాంచ్ మేనేజర్ విజయ్, ఏరియా మేనేజర్ రవికృష్ణ ఘనంగా సన్మానించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రాఫిట్ షూట్ మార్ట్ కంపెనీ సన్మానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఎస్‌ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయుడు సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

అమడగూరు: తహసీల్దార్ రామనాథరెడ్డిని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న మహేశ్వర్‌రెడ్డిని ఎఫ్‌ఏసీ తహసీల్దార్‌గా నియమించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

ముదిగుబ్బ: మండలంలోని కొండగట్టుపల్లిలో శుక్రవారం రైతులకు వేరుశనగ విత్తన పంపిణీ నిర్వహించారు. ఎంపీపీ ఆదినారాయణ హాజరై రైతులకు విత్తన కాయలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ రవీంద్ర, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, ఎంపీటీసీ మంజునాథ్, సర్పంచ్‌లు నాగభూషణ, పాపయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అందని సాయం.. రైతుల దైన్యం

- పంట పెట్టుబడి కోసం అన్నదాతల అష్టకష్టాలు
- ఖరీఫ్ ప్రారంభమైనా అన్నదాత సుఖీభవ ఊసే ఎత్తని ప్రభుత్వం
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న వైనం



దుక్కి దున్నుతున్న రైతు

నల్లచెరువు: తొలకరి వర్షాలతో రైతులు ఖరీఫ్ పంట సాగుకు కదిరి డివిజన్ వ్యాప్తంగా రైతులు సన్నద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో పంట పెట్టుబడి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంట సాగుకు రైతులు పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గత ఐదేళ్లు మే లేదా జూన్ మాసంలోనే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రెండో ఏటా ఖరీఫ్ సీజన్‌కు కూడా రైతులను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో పెట్టుబడి సాయం ఇస్తారో..ఇవ్వరోనని కదిరి డివిజన్ వ్యాప్తంగా ఉన్న దాదాపు 85,000 మంది రైతులకు పైగా ఆందోళన చెందుతున్నారు.

ఐదేళ్లలో రూ.67,500 చొప్పున సాయం...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో రైతులకు ఇచ్చిన హామీల కన్నా మిన్నగా 79,933 మంది రైతులకు రూ.13500 చొప్పున ఐదేళ్ల పాలనలో ఒక్కొక్కరికీ రూ.67,500 నేరుగా రైతులకు అందించి అండగా నిలిచింది. ప్రతి రైతుకూ పీఎం కిసాన్‌తో కలిపి ఏటా మే లేదా జూన్ మాసాల్లో రూ.7,500 అక్టోబరులో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా గత గత ప్రభుత్వం జమ చేసింది. భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు చెందిన కౌలుదారులకు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.13,500 నేరుగా కౌలు రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. ఇక ఉచిత పంటల బీమా పథకం కింద ప్రీమియాన్ని గత ప్రభుత్వం భరించింది. అయితే కూటమి ప్రభుత్వంలో పంటల బీమా భారం రైతులపైనే మోపింది.

వడ్డీ వ్యాపారులే దిక్కు



కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ కింద రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తా మన్నారు. కూటమి ప్రభుతం ఏర్పడి రెండో ఖరీఫ్ సీజన్ వస్తున్నా నాయకులు ఆ ఊసే ఎత్తడం లేదు. పెట్టుబడి డబ్బు కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులే దిక్కయ్యారు.

– అమర్‌నాథ్ రెడ్డి, ఉప్పార్లపల్లి, నల్లచెరువు మండలం

రైతులను ఆదుకోవాలి



ముందస్తుగా కురుస్తున్న వర్షాలకు రైతులు పంటసాగుకు సన్నద్ధమవుతున్నారు. గత జగనన్న పాలనలో ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమచేసేవారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం రూ.20 వేల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమచేసి రైతులను ఆదుకోవాలి.

– జొన్నా ఆదిమూర్తి, రైతు, నల్లచెరువు మండలం

వివరాలు సేకరించాం



అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల నుంచి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత రైతుల ఖాల్లో పెట్టుబడి సాయం జమ చేస్తాం. బీమా మొత్తం రైతులే చెల్లించాలని ఇప్పటికే స్పష్టత వచ్చింది.

– సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి

గాండ్లపెంట: మూడు నెలలకోసారి నిర్వహించే మండల మీట్‌కు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి ఎంపీడీఓను కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను విద్యుత్ అధికారులకు దృష్టికి తీసుకెళ్దామంటే మండల మీట్‌కు అధికారులు డుమ్మా కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ శాఖల ప్రగతితోపాటు పథకా వివరాలను తెలియజేశారు. ఉపాధి హామీ పనులను అటవీ శాఖ సిబ్బంది అటవీ ప్రాంతంలో పనులను చేయనివ్వడంలేదని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సుధాకర్ కోరారు. ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ బాబూరావు, వైద్యాధికారి మహేశ్వరమారుతి, పశు వైద్యాధికారి కేశవనాయక్, ఐసీడీఎస్ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ వీరంగం

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ కేంద్రంలో ఓ పోలీసు కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. ఈయన అనంతపురం నగరంలో పని చేస్తుండగా.. భార్య 'స్పౌజ్' కోటా కింద బదిలీకి దరఖాస్తు చేసుకుంది. అనంతపురం రూరల్ మండలంలో ఖాళీ లేకపోవడంతో దగ్గరగా అంటే గార్లదిన్నె మండలంలో కోరుకోవాలని అధికారులు సూచించారు. లేదా బత్తలపల్లి మండలం తీసుకోవాలని చెప్పారు. అయితే కానిస్టేబుల్ మాత్రం తన భార్యకు కనగానపల్లి మండలం ఇవ్వాలంటూ పట్టుబట్టాడు. గార్లదిన్నె, బత్తలపల్లి మండలాలు తీసుకునేందుకు ససేమిరా అంటూ వాగ్వాదానికి దిగాడు. అరగంటకు పైగా పంచాయితీ తేలకపోవడంతో సామాన్య టీచర్లు తిరగబడే పరిస్థితి నెలకొంది. చేసేది లేక చివరకు గార్లదిన్నె మండలం తీసుకోవాల్సి వచ్చింది.

తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత బిడ్డలదే..

హిందూపురం: కుటుంబ సభ్యుల ఆదరణకు దూరమై అనాథాశ్రమాల్లో తలదాచుకుంటున్న వృద్ధులను ప్రేమాభిమానాలతో ఆదరించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మోడల్ కాలనీలో నూతనంగా ఏర్పాటైన ప్రణమ్ అనాథాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అనాథలను ఆదరించి వారికి యోగక్షేమాలు చూడటం మానవ ధర్మమన్నారు. బిడ్డలు.. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వీధుల పాలు చేయడం పాపమన్నారు. ఈ పరిస్థితి తిరిగి తమ దాకా వస్తుందని వారు గ్రహించాలన్నారు. అనాథ ఆశ్రమంలోని వృద్ధులు, అనాథ చిన్నారులకు ఏమైనా సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా మండల న్యాయ సేవ అధికారి సంస్థలో ఫిర్యాదు చేస్తే నోటీసులు పంపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ప్రభుత్వ న్యాయవాది జి.శ్రీనివాస్‌రెడ్డి, అనాథ ఆశ్రమ నిర్వాహకులు ఆదిత్య, చంద్రాయుడు, లోక్‌అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ అంతరాయం

ధర్మవరం అర్బన్: పట్టణంలో శనివారం నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ నాగభూషణం శుక్రవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని కేశవనగర్, సంజయ్‌నగర్, నేసేపేట, గుడ్డిబావివీధిలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భర్త ధర్మవరంలో.. భార్య పామిడిలో

- నిబంధనలకు విరుద్ధంగా 'స్పౌజ్' కోటా టీచర్ బదిలీ
- విద్యాశాఖ వివాదాస్పద నిర్ణయం

అనంతపురం ఎడ్యుకేషన్: 'స్పౌజ్' కోటా టీచర్ బదిలీలో విద్యాశాఖ అధికారులు వివాదాస్పద నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. స్పౌజ్ కోటా కింద బదిలీ అయ్యే టీచర్లు.. స్పౌజ్ పని చేస్తున్న సమీపంలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయంలో కమిషనర్ విజయ రామరాజు చాలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జరిగిన కౌన్సెలింగ్‌లో భర్త ధర్మవరంలో పని చేస్తుంటే.. భార్యను పామిడి మండలానికి బదిలీ చేశారు. అంతకు ముందు దాకా అదే పాఠశాలలో ఖాళీగా ఉంటే స్పౌజ్‌ను కూడా అక్కడికే పంపిన అధికారులు.. ఈమె విషయంలో మాత్రం తప్పుడు నిర్ణయం తీసుకోవడం వెనక అంతర్యం ఏమిటనే చర్చ జరుగుతోంది. స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లకు స్పౌజ్ సర్టిఫికెట్‌ను ఒకటికి రెండుసార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మరి పామిడికి పంపిన టీచర్ విషయంలో ఇలా ఎందుకు జరగలేదనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఓ కీలక అధికారి ఆదేశాల మేరకు ఉద్యోగులు కావాలనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఏది ఏమైనా వివాదాస్పద నిర్ణయం తీసుకున్న విద్యాశాఖ అధికారులపై సామాన్య టీచర్లు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబును వివరణ కోరగా.. సంబంధిత టీచర్ తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లనే ఇలా పొరపాటు జరిగిందని వెల్లడించారు. వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముచ్చట గొలిపిన ఇంద్ర ధనస్సు



వెంకటగారిపల్లి వద్ద ఏర్పడిన ఇంద్రధనస్సు

పుట్టపర్తి అర్బన్: నైరుతీ రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం ఆకాశం మేఘావృతమైంది. ఈక్రమంలో వెంకటగారిపల్లి–జగరాజుపల్లి మధ్య ఇంద్రధనస్సు ఏర్పడడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఇంద్రధనస్సు సుమారు గంటకు పైగా ఆకాశంలో కనువిందు చేసింది.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



కుమార్‌స్వామిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నాయకులకు సూచించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ధర్మవరం పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడిగా కోటిరెడ్డి బాలిరెడ్డిని నియమించడంతోపాటు పట్టణ కమిటీని నియమించడంతో శుక్రవారం వారంతా మాజీ ఎమ్మెల్యే నివాసంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మద్దిలేటి మల్లికార్జున, కత్తె పెద్దన్న, నాయకులు చాంద్‌బాషా, చింతా యల్లయ్య, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, చింతా మారుతి, మట్టిద్దుల కేశవరెడ్డి, కడప రంగస్వామి, ఎస్‌పీ భాష, గోరకాటి పురుషోత్తంరెడ్డి, బొమ్మన్న, బాలం గోపాల్, బడన్నపల్లి కేశవరెడ్డి, తిరుమల్‌రెడ్డి, సాకే వెంకటేష్, బి.మల్లికార్జున, సూర్యనారాయణరెడ్డి, వెంకటశివారెడ్డి, రామదాసునాయక్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

పట్టణంలోని సిద్దయ్యగుట్ట వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కుమార్‌స్వామి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే కుమార్‌స్వామి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని ఆయనకు భరోసా కల్పించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్ తదితరులు

బత్తలపల్లి: తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం డి.చెర్లోపల్లి, అప్పరాచెరువు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులు అనంతరం విద్యా సంవత్సరం గురువారం నుంచి ప్రారంభమైందన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలకు క్రమం తప్పకుండా వెళ్లి బాగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించిందన్నారు. ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య బోధించడానికి ఉపాధ్యాయులను నియమించిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వీరనారప్ప, సత్యనారాయణరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ గోపాల్, ముసుగు రామచంద్ర, గురుప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు ఘన నివాళి







కదిరిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు . తనకల్లు, తలుపులలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కదిరి టౌన్: గుజరాత్‌లోని అహ్మదాబాదులో ఎయిర్ ఇండియా విమానం కూలిన ఘటనలో 241 మంది మృతి చెందడం చాల బాధకరమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎయిర్ ఇండియా విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలియజేస్తూ కొవ్వోత్తులతో నివాళుర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పట్టణాధ్యక్షుడు షేక్ బాబ్జాన్, కౌన్సిలర్ రామ్‌ప్రసాద్, రూరల్ కన్వీనర్ మణికంఠనాయక్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నేత రాజేంద్రయాదవ్, నాయుడు, రఫి, రమేష్‌యాదవ్, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ సర్కిల్‌వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ శుక్రవారం కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో పెద్దసంఖ్యలో ప్రయాణికులు మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కొండకమర్ల ముస్తాఫా, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, మండల కమిటీ సభ్యులు నరేంద్ర, సూరి, బయారెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు బీఎస్ కలాం, డీలర్ నరసింహులు, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీపతి, రమేష్‌రెడ్డి, ప్రకాశ్, విశ్వనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరి,తులశమ్మ,లక్ష్మీదేవి పాల్గొన్నారు.

తలుపుల: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపంగా తెలియజేస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు దేవుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల జనరల్ సెక్రటరీ ఎర్రమరెడ్డి, నాయకులు ఉత్తారెడ్డి, గంగాధర్, ఉసేన్ మియా, మౌలా, అక్కుల్‌రెడ్డి సలీం తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తూ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మొండెం రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. నాయకులు కె.రమణారెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి, మైనార్టీ నాయకులు నజీర్, హైటెక్ రమణ, మాజీ జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్, వెంకటరెడ్డి, ఖాదర్ వలి, మంజునాథ నాయుడు, గోవిందురెడ్డి, చిన్నపల్లి హరి, మహేశ్వర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి షకూర్, దావుద్‌ఖాన్, ఇర్ఫాన్ , ఇస్మాయిల్, మన్సూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కదిరి–రాయచోటి ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. మాజీ ఎంపీపీ జగన్మోహన్, నాయకులు పామిడి ఇక్బాల్, బావుద్దీన్, ఆసిఫ్, మహమ్మద్ అలీ, నాగరాజు, అజీమ్, అంజి, రవినాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.



గాండ్లపెంటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నల్లచెరువులో..

ఏఓ బాధ్యతల స్వీకరణ



భారతి

తనకల్లు: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓగా భారతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లచెరువులో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ తనతోపాటు వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు.

వ్యవసాయ అధికారిగా శేఖర్‌నాయక్



తాడిమర్రి: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓగా శేఖర్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న రమాదేవిని అనంతపురంలోని రసాయన ఎరువుల పరీక్ష కేంద్రానికి బదిలి అయ్యారు. అగళిలో ఏఓగా పని చేస్తున్న శేఖర్ నాయక్‌ను ఇక్కడికి నియమించారు.ఈసందర్భంగా ఆయన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి విత్తన పంపిణీ, అన్నదాత సుఖీభవ ఈకేవైసీ తదితర అంశాలపై సూచనలిచ్చారు.

ముదిగుబ్బ ఏఓగా రవీంద్ర



ముదిగుబ్బ: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓగా రవీంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీనరసింహులు బదిలీపై అనంతపురంలోని రైతు శిక్షణా కేంద్రానికి వెళ్లారు. ఈయన స్థానంలో జిల్లా వ్యవసాయ కార్యాలయంలో విధులను నిర్వహిస్తున్న రవీంద్ర బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా చూస్తామన్నారు.

గృహ నిర్మాణ సంస్థ డీఈగా లక్ష్మీనారాయణమ్మ



లక్ష్మీనారాయణమ్మకు ఆహ్వానం పలుకుతున్న సిబ్బంది

ధర్మవరం అర్బన్: గృహ నిర్మాణ సంస్థ డివిజన్ ఇంజినీర్‌గా లక్ష్మీనారాయణమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం సబ్ డివిజన్‌లో పని చేస్తున్న లక్ష్మీనారాయణమ్మ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆమెకు గృహ నిర్మాణశాఖలోని ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం పలికారు.

ప్రైవేట్ పాఠశాలకు నోటీసులు

బత్తలపల్లి: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అడ్మిషన్లు చేపట్టిన ఫోనిక్స్ గ్లోబల్ అప్పర్ ప్రైమరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పాఠశాలకు గుర్తింపు రాకుండానే అడ్మిషన్లు జరుగుతున్నట్లు మండలంలోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నేతలు ఫిర్యాదు చేశారన్నారు. పాఠశాలను సందర్శించినప్పుడు తరగతి గదులు ఇంకా మరమ్మతులు పూర్తి స్థాయిలో లేకపోవడం గమనించామన్నారు. పాఠశాల ఏర్పాటుకు తగిన తరగతి గదులు ఏర్పాటు, అర్హత గల ఉపాధ్యాయుల ఏర్పాటు, ప్రహరీ ఏర్పాటు, ఆట స్థలం మొదలైన ఇతర ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేసి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన తర్వాత మాత్రమే పాఠశాలలను నిర్వహించాలని ఆదేశించామన్నారు.